

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కామవరపుకోట

ఏలూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులను 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏప్రిల్ 30 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



'కొలువు' కుస్తీ..!

- ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా బిఇడి, డిఎడ్ అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో వెయ్యి వరకూ పోస్టులు ఉన్నట్లు లెక్క
- కోచింగ్ కోసం అవనిగడ్డకు క్యూ
- ప్రస్తుత ఉద్యోగాలు వదిలి ప్రభుత్వ కొలువు కోసం పాట్లు
- పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఒకే రోజు పెట్టాలని అభ్యర్థుల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ కొలువు కోసం బిఇడి, డిఎడ్ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయ కొలువు కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోయారు. నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం మెగా డిఎస్‌సి పేరుతో 16 వేలకుపైగా పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎన్నోఏళ్లుగా ఉపాధ్యాయ కొలువు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులంతా ఈసారి అవకాశాన్ని జారవిడుచుకోకూడదనే లక్ష్యంతో కష్టపడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల మందికిపైగా బిఇడి, డిఎడ్ చదివిన అభ్యర్థులు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం విడుదల చేయబోయే డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లాలో వెయ్యి వరకూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉందని లెక్కలు చెబుతున్నారు. దీంతో బిఇడి, డిఎడ్ చదువుకున్న అభ్యర్థులంతా ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు కోచింగ్ సెంటర్లకు అభ్యర్థులు క్యూ కడుతున్నారు. డిఎస్‌సి కోచింగ్‌కు అత్యంత ప్రసిద్ధి చెందిన కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు అంతా తరలివెళ్తున్నారు. మూడు నెలల కోచింగ్‌కు రూ.20 వేల వరకూ ఫీజు, హాస్టల్ ఖర్చులతో మొత్తం దాదాపు రూ.50 వేలు వరకూ ప్రతి నిరుద్యోగ అభ్యర్థి ఖర్చు పెడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలాఖరుకు ఉపాధ్యాయ కొలువుల భర్తీని పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సరిపడే సమయం ఉండటంతో కష్టపడితే కొలువు సాధించవచ్చుననే పట్టుదలతో అంతా నిమగ్నమయ్యారు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా కష్టపడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. అయితే కోచింగ్‌లకు వెళ్లేవారికి కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటి వరకూ జిల్లాలవారీగా పోస్టుల వివరాలను ప్రకటించలేదు. దీంతో ఒక్కో అభ్యర్థి రెండు, మూడు పోస్టులకు అర్హులుగా ఉన్నారు. పోస్టుల వివరాలు ప్రకటిస్తే అందుకు తగినట్లుగా కోచింగ్ చెప్పించుకోవచ్చునని అంతా మదనపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పోస్టుల వివరాలను ప్రకటించాలని పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులంతా కోరుతున్నారు. వయో పరిమితి దగ్గర పడుతున్న అభ్యర్థులు ఈసారి కొలువు సాధించేందుకు తహతహలాడుతున్నారు. అదే సమయంలో డిఎస్‌సికి సిద్ధమవుతున్నవారిలో సచివాలయ ఉద్యోగులు సైతం ఎక్కువగా ఉన్నారు. సచివాలయాల్లో గ్రేడ్-5, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులుగా పని చేస్తున్న వారంతా ఎక్కువ మంది బిఇడి చదివిన వారే ఉన్నారు. వీరంతా ఈసారి డిఎస్‌సిలో మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయ కొలువు సాధించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

డిఎస్‌సి పరీక్ష ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్

డిఎస్‌సి పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఒకేరోజు నిర్వహించాలని ఉపాధ్యాయ కొలువు కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులంతా కోరుతున్నారు. గతంలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష ఒకేరోజు కాకుండా నాలుగైదు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఒకరోజు పరీక్ష పేపర్ తేలికగా వస్తే, మరోరోజు కష్టంగా వస్తుందని, ఎంపిక మాత్రం ఒకేలా ఉంటుందని అభ్యర్థులు చెబుతున్నారు. పరీక్ష కష్టంగా వచ్చిన రోజు అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకే రోజు ఒకే పేపర్‌తో ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇంకా ఏ విషయం తేల్చలేదు. ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం అంగీకారం తెలుపుతుందో లేదో వేచిచూడాలి.



మొగల్తూరు : వెంప రహదారిలో నిలిచిన వర్షపు నీరు

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు నిలిచింది. కొన్ని సంవత్సరాలుగా గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేయలేదు. దీంతో వాటిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధిక వర్షానికి ఆ గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. మొగల్తూరు-వెంప, హైస్కూల్ రోడ్డు, శేరేపాలెం, పేరుపాలెం తదితర గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపై నిలిచిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాళ్ల హైస్కూల్ మైదానంలో నిలిచిన నీరు

కాళ్ల: ఆదివారం కురిసిన వర్షానికి కాళ్లలోని హైస్కూల్ మైదానం నీట మునిగింది. వర్షం కురిస్తే ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు స్పందించి హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

21.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

నరసాపురం: జిల్లాలో ఆదివారం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 58.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కాళ్లలో 4.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. పెంటపాడులో 57.2, భీమవరం 26.8, అత్తిలి 26.4, తణుకు 25, నరసాపురం, గణపవరంల్లో 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 21.6 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వర్తకులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా
మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో బట్టల దుకాణ వర్తకులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, తనపట్ల చూపే అభిమానం మరువలేనిదని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఆదివారం క్లాత్ అండ్ యారన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో జరిగిన అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార సభలో మంత్రి పాల్గొని నూతన కమిటీని అభినందించి మాట్లాడారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వట్టం గణేష్ తిరిగి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా సలాది జనార్ధనరావు, కోశాధికారిగా బాసిన సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు.

చాక్లెట్లంటే ఇష్టం లేనివారండరు
భీమవరంలో ప్రపంచ చాక్లెట్స్ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్



నోరూరించే చాక్లెట్లంటే ఇష్టం లేనివారుండరని, ఆ పేరు వినగానే నోట్లో నీళ్లూరుతాయని, అమ్మనో.. నాన్ననో అడిగి ఓ చాక్లెట్ కొనిపించుకుని చిన్నారులు తింటారని బార్ అసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్‌నాయుడు, ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పి.అమూల్యరావు అన్నారు. ఆదివారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గునుపూడిలోని బాలికల హాస్టల్‌లో ప్రపంచ చాక్లెట్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాక్లెట్ అంటే పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ ప్రీతి అని అన్నారు. ఐరోపాలో చాక్లెట్లు మొదటిసారిగా పరిచయమయ్యాయని, 1550 జులై 7న చాక్లెట్ల దినోత్సవంగా కేటాయించారని, చాక్లెట్ల రుచుల్లో మొత్తం 600 రకాలున్నాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హాస్టల్ వార్డెన్ శ్యామల మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద చాక్లెట్ బార్ బరువు 5,792 కిలోలని, ఒక్క చాక్లెట్ చిప్ తింటే 150 అడుగులు నడవడానికి కావలసిన శక్తి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సుంకర చంద్, పి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు పరిసర ప్రాంతంలో పొలంలో దుక్కుతున్న రైతు

వరినాట్లకు సన్నాహాలు..!
మరో వారం రోజుల్లో సిద్ధంకానున్న నారు - ముమ్మరంగా దుక్కులు

ప్రజాశక్తి - ఆకివీడు

సార్వా వరి నాట్లకు రైతులు సిద్ధమవుతున్నారు. సాధారణంగా జులై వచ్చేసరికి నాట్లు సగానికిపైగా పూర్తవ్వాలి. అయితే ఈ సంవత్సరం కాల్వలకు నీరు జూన్ ఒకటో తేదీనే విడుదల చేసినా దిగువకు పూర్తిస్థాయిలో అందకపోవడం, రుతుపవనాలు సకాలంలో వచ్చినా అవసరమైన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నారుమళ్లు ఆలస్యమయ్యాయి. దీంతో నాట్లు సైతం ఆలస్యమయ్యాయి. నారు మరో వారం, పదిరోజుల్లో పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో వారం రోజుల్లో నాట్లు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని అంచనా.

విఇసి జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం
ఎస్‌విఎస్ అనే పేరు తొలగించాల్సిందే - స్పష్టం చేసిన గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలోని విఇసి ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని, అయితే ఎస్‌విఎస్ అంటూ అదనంగా చేర్చిన పేరు తప్పనిసరిగా తొలగించాల్సిందేని గ్రామస్తులు, పూర్వపు విద్యార్థులు స్పష్టం చేశారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలగా ఉన్న విఇసి జూనియర్ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కళాశాలగా మార్పు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కళాశాల అభివృద్ధి విషయమై ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల అభివృద్ధికి సలహాలు, సూచనల కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెరగాలంటే తొలుత పూర్తిస్థాయిలో అధ్యాపకులను, సిబ్బందిని నియమించాలన్నారు. వీరవాసరం పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది పేద బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే మానివేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బాలికల విద్యను ప్రోత్సహించాలని విఇసి



వీరవాసరం కళాశాల సమావేశానికి హాజరైన గ్రామస్తులు

జూనియర్ కళాశాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. గ్రామానికి చెందిన దాతలు ముందుకు రావడం వల్లే అప్పట్లో ఈ కళాశాల ఏర్పడిందన్నారు. వారి మధ్యనున్న విభేదాలను అవకాశంగా తీసుకుని ఈ కళాశాలకు సంబంధం లేని వ్యక్తులతో కమిటీ ఏర్పాటు చేయడం దురదృష్టకరమన్నారు. సొమ్మొకరిది.. సోకొకరిది అనే చందంగా కళాశాల యాజమాన్యం తీరు ఉందని వాఖ్యానించారు. దాతలు, ప్రభుత్వ నిధులతోనే ఈ కళాశాల అభివృద్ధి చెందిందన్నారు. అటువంటి కళాశాల అప్పటి యాజమాన్య నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఆదరణ కోల్పోయిందన్నారు. అయినప్పటికీ విఇసి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ప్రిన్సిపల్ కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు గ్రూపులు, ఒకేషనల్ కోర్సులతో కళాశాల కొనసాగుతుందన్నారు. ఈ సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. వచ్చే సంవత్సరం నుండి మరికొన్ని గ్రూపులను కొత్తగా తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రామస్తులు మద్దాల తాతారావు, వీరవల్లి రామకృష్ణ, జివివి.రామానుజరావు, బాజంకి కృష్ణారావు, మద్దాల సత్యనారాయణమూర్తి, బోను దర్గాప్రసాద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ కృషికి పలువురు కృతజ్ఞతలు
ఎన్‌టిఆర్ కళాక్షేత్రం పూర్తి చేసేందుకు నిమ్మల కృషి

ప్రజాశక్తి - పాలకొల్లు



మంత్రి నిమ్మలను కలిసి సత్కరిస్తున్న కళాకారులు

పట్టణ కళాకారులు, నటీనట సంక్షేమ సమైక్య ఆధ్వర్యంలో మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రణాళికా బద్ధంగా చేస్తున్న మంత్రి నిరంతర శ్రమకు, అవిరాల కృషికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో నిర్మాణంలో ఉండి ఆగిపోయిన ఎన్‌టిఆర్ కళాక్షేత్రాన్ని ఇటీవల పరిశీలించి వేగవంతంగా పూర్తిచేసి నాటక ప్రదర్శనలకు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్న నిమ్మలకు పట్టణంలోని కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో ఏ విధమైన నిధులు కేటాయించకుండా ఈ కళాక్షేత్రాన్ని పూర్తి చేయకుండా చిన్నచూపు చూసిందని, దీనివల్ల పట్టణంలో కళాపరిషత్తులు నిర్వహించేందుకు, నాటికలు ప్రదర్శించేందుకు, కళాసంస్థలు, కళాకారులు రిహార్సల్స్ చేసుకునేందుకు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు వేదిక లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురైనట్లు కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కళారంగానికి కొత్త రూపు తీసుకురావడానికి, నంది నాటకోత్సవాలు ఇక్కడే నిర్వహించేందుకు ఈ కళాక్షేత్రాన్ని త్వరగా ప్రారంభించేలా మంత్రి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నటీనట సంక్షేమ సమైక్య గౌరవాధ్యక్షులు వంగా నరసింహారావు, గుడాల హరిబాబు, కార్యదర్శి తాళబత్తుల వెంకటేశ్వరరావు, రాజా తాతయ్య, గంటా రామ్మోహన్, శివాల రామారావు, పుచ్చల నాగలింగేశ్వరరావు, గంట ముత్యాల నాయుడు, యర్రంశెట్టి వెంకటరత్నం, జిఎస్ఎన్.రవి పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్ర ప్రారంభానికి సహకరించాలి
లయన్స్ రాష్ట్ర మాజీ చైర్మన్ కృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడులో కిడ్నీవ్యాధి గ్రస్తులకు అవసరమైన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభానికి అంతా సహకరించాలని, అందుకు నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ ముందడుగు వేయాలని లయన్స్ రాష్ట్ర కౌన్సిల్ మాజీ ఛైర్మన్, అంతర్జాతీయ ఎగుమతుల సంస్థ లక్ష్మీ గ్రూప్స్ అధినేత చిలువూరి కృష్ణంరాజు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు, క్లబ్ ఆఫ్ గోల్డెన్ ఆక్వా, క్లబ్ ఆఫ్ చినకాపవరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బివి.కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సభలో చిలువూరి కృష్ణంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అలాగే కేన్సర్ స్క్రీనింగ్ కేంద్రం, మధుమేహం స్క్రీనింగ్ కేంద్రాలు ప్రారంభించడానికి ముందడుగు వేయాలని నూతన క్లబ్ సభ్యులకు ఆయన సూచించారు. దేశంలో అత్యంత ప్రమాదకరంగా మారిన కేన్సర్, మధుమేహం వ్యాధులను అరికట్టడంలో లయన్స్ క్లబ్ సభ్యులు మరో అడుగు ముందుకు వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 50 సంవత్సరాలు దాటిన వారు కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం లయన్స్ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి లయన్ డాక్టర్ వికె.పంకజాక్షన్, నూతన లయన్స్, లియో క్లబ్ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్‌విఎస్.సూర్యనారాయణరాజు, రీజన్ ఛైర్‌పర్సన్ గొంట్లా కృష్ణమూర్తి, మద్రివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 10న డిమాండ్స్ డే
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ఏలూరు అర్బన్: నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రయివేటీకరణ విధానాలు నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 10న సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేపట్టిన పోరాటాల ఫలితంగా మోడీ ప్రభుత్వానికి సీట్లు తగ్గాయన్నారు. ఇప్పటికైనా లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కీలకమైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, బ్యాంక్ వంటి రంగాలను ప్రయివేట్ పరం చేసే ఆలోచనలను, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ, ఆశ, వెలుగు, ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర రంగాల కార్మికులందరినీ ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, వారందరికీ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి పథకాలు అమలు చేయాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో డిమాండ్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు జి.రాజు, ఎం.నాగమణి, బి.సోమయ్య, వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, ఎస్‌కె.సుభాషిణి, ఆర్‌విఎస్.నారాయణ, నారపల్లి రమణరావు, ఎస్.రాంబాబు, ఎం.దుర్గారావు, వై.సాయికిరణ్ మాట్లాడారు.

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మను ఆదివారం జిల్లా కలెక్టర్ సి.నాగరాణి భీమవరంలోని కేంద్ర మంత్రి ఇంటివద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు జిల్లా అభివృద్ధిపై చర్చించారు.




వృద్ధులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్, జనరల్ డాక్టర్ సాతులూరి అనుస్మిత ఆదివారం తణుకు, పైడిపర్రు, వేల్పూరు ప్రాంతాల్లో ఇంటికి పరిమితమైన వారి సంచారశకటం ద్వారా పర్యటించి 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందించారు. డాక్టర్ కె.రావు, ఇండియన్ నెట్వర్క్ ఫౌండేషన్-యుఎస్ఎ సంస్థ వారి ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అల్లి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది సహకరించారు. ఈ ఉచిత వైద్యసేవలు కోరు వారు స్వయంగా గాని, లేదా సెల్ నెంబర్ 9985345350 సంప్రదించవలెని తెలియజేశారు.

ముఖ్యమంత్రుల కలయిక శుభ పరిణామం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల కలయిక దేశంలోనే ఒక మంచి పరిణామం అని బీసీ దేవాంగ సాధికార సమితి కన్వీనర్ రొబ్బి భాస్కరరావు అన్నారు. ఆదివారం మార్టేరులో విలేకరులతో మాట్లాడుతూ ఇది మంచి మార్పునకు శ్రీకారమని, ఆంధ్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు పాలన చేసిన ఐదేళ్ల కెసిఆర్ హైదరాబాద్లో నిలవనీకుండా చేశారని అన్నారు. అప్పుడు చంద్రబాబు నాయుడు మీద కోపంతో ఎటువంటి సమస్యలైనా సృష్టించి తెలంగాణ నుంచి పాలన సాగనీయకుండా అడ్డంకులు సృష్టించుటే అత్యవసరంగా అమరావతికి తరలివచ్చినా, రాజధానిలో ఏమీ లేని సమయంలోనే త్వరగా బిల్డింగులను పూర్తి చేసి పాలనని చంద్రబాబు నాయుడు సాగించారన్నారు. తరవాత వచ్చిన వైసిపి ప్రభుత్వం 70 శాతం అమరావతి అభివృద్ధిని పక్కన పెట్టి అప్పగించినా, దాన్ని తిరస్కరించడమే కాదు నేలపాలు చేసారని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి కలయిక ఇరు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప చిహ్నంగా చూడవచ్చని రొబ్బి పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ పార్కు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దీని చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు మొలచి స్తంభానికి, విద్యుత్ లైన్లను అల్లుకుంటున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో మొక్కల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం, మంగళవారం విద్యుత్ అధికారులు చెట్లు కొట్టే కార్యక్రమం చేస్తూ ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నప్పటికీ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఇలా ఉండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అది కూడా హౌసింగ్ బోర్డ్లోనే సబ్స్టేషన్ ఉండటం గమనార్హం.


ట్రాన్స్ఫార్మర్ చుట్టూ దట్టంగా పేరుకుపోయిన మొక్కలు

'ప్రవీణ్ప్రకాష్పై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - తణుకు

విద్యాశాఖ మాజీ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఐఎఎస్ అధికారి ప్రవీణ్ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణ ఇవ్వరాదని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రవీణ్ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యాశాఖను, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వేధించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇలాంటి వారు చేసిన తప్పులను భవిష్యత్తులో ఎవరూ చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అధికారి అనాలోచిత చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా, విద్యార్థులు చేరక పాఠశాలలను మూసివేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈయన హయాంలో వేల సంఖ్యలో అక్రమ బదిలీలు జరిగాయని, వాటిపైన విచారణ జరిపించాలని, విద్యార్థులకు ఇచ్చే స్కూల్ బ్యాగ్లు, పుస్తకాలు వంటి విద్యాసామాగ్రి పంపిణీ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తెలిపారు. ఈ అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని రాజగోపాల్ డిమాండ్ చేశారు.

మందకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు


కేక్ కట్ చేస్తున్న నాయకులు.

ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను ఆ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన అభిమానుల ఏర్పాటుచేసిన కేకులు నాయకులు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. పార్టీ ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జెండా ఎగరవేశారు. ఆయా కార్యక్రమాల్లో నరసాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి కారుమంచి హరిబాబు, గౌరవ అధ్యక్షులు అశోక్, నాయకులు గరికిపూడి జేమ్స్ రాజు, జిల్లా అధ్యక్షులు రత్న రాజు, మహిళా అధ్యక్షురాలు సెట్టెం ఝాన్సీ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలం శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షులు శేఖర్ బాబు, పేరుపాలెం గ్రామం అధ్యక్షులు లక్కవరపు జకరయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కీర్తిశేషులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రం మొగల్తూరులో సోమవారం నిర్వహిస్తున్నామని వైసిపి మొగల్తూరు గ్రామ అధ్యక్షుడు కుక్కల కృష్ణమోహన్ తెలిపారు. ఈ వేడుకలకు వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మోడి గ్రామానికి చెందిన వన్నెం రెడ్డి కేశవరాయుడు ఇంటిలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశవ రాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల మూడవ తేదీన షిరిడి వెళ్లారు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి తెరిచి ఉన్నాయి. గదిలోని బీరువా ధ్వంసం చేసి, దానిలో భద్రపరిచిన సుమారు మూడు లక్షల విలువ గల సుమారు ఐదు కాసుల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు కేశవ రాయుడు మొగల్తూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. భీమవరం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

వెంపలో పనిచేయని సీసీ కెమెరాలు

పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు
మరమ్మతులు చేయించాలని ప్రజల వేడుకోలు


ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెంప గ్రామం సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా, నలుగురికి ఆదర్శంగా నిలుస్తుంది. అభివృద్ధిలో ముందుకు సాగుతూ చక్కటి గ్రామీణ వాతావరణం, ఆ గ్రామంలో నిత్యం పచ్చదనంతో కన్నుల విందుగా కనిపిస్తుంది. అయితే ఇటీవల గ్రామంలో వరుస వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉండటమే కాకుండా గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. దీంతో వివాదాల నుంచి గ్రామం ఎప్పుడు బయట పడుతుందో లేక ఈ వివాదాలు ఎటు నుంచి ఎటు దారి తీస్తాయోనని గ్రామంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. అయితే ఎటువంటి వివాదాలకైనా న్యాయాన్ని నిరూపించాలంటే సామాన్యులకు కష్టంతో కూడుకున్న పని, దీంతో గతంలో పంచాయతీల్లో ఎటువంటి వివాదాలు చోటు చేసుకున్నా, ప్రజల వద్ద కొంత సమాచారం సేకరించినప్పటికీ.. అసలైన సమాచారం అందించేది మాత్రం నిఘా నేత్రంగా చెప్పుకునే సీసీ కెమెరాలే అసలైన దోషులను పట్టించడంలో పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దీంతో పోలీసులు కొన్ని సందర్భాల్లో క్లిష్టమైన కేసులు సీసీ కెమెరాల ఆధారాలతోనే అసలైన దోస్తులను, చోరీలకు పాల్పడిన వారిని సులువుగా పట్టుకుంటున్నారు. దీంతో దాతల సహకారంతో వెంప గ్రామ పంచాయతీలో గత పంచాయతీ పాలకవర్గంలో పంచాయతీ కార్యాలయంతో పాటు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సుమారు 20కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలు పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయవలసి ఉంటుంది, కానీ కెమెరాలకు పవర్ సప్లై అందించే వైర్లు తెగిపోయి అస్వస్థంగా మారడంతో గత కొంతకాలంగా సీసీ కెమెరాలు పనిచేయట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయినా పంచాయతీల్లో సీసీ కెమెరాలు పనిచేయనప్పటికీ అధికారులు మాత్రం వాటిని మరమ్మతులు చేపట్టేందుకు చొరవ చూడట్లేదనే విమర్శలూ వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం వెంప గ్రామంలో ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయట్లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామంలో స్మశాన వాటిక వివాదంతో పాటు, మరో రెండు వివాదాలు కూడా గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఈ వివాదాలతో ఎటువంటి ఉపద్రవం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాలను బయటపెట్టే సీసీ కెమెరాల పర్యవేక్షణ గ్రామంలో తప్పకుండా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే తమ గోడును అధికారులకు చెప్పేందుకు వచ్చే సమయంలో ఎటువంటి వివాదం చెల్లరేగుతుందో, దాంట్లో ఎవర్ని బాధితులను చేస్తారో తెలియట్లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలోని పంచాయతీలో ఉన్న సీసీ కెమెరాలు తక్షణమే మరమ్మతులు చేయించాలని, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టకపోతే, అవి మరింత నాశనం అవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



వెంప గ్రామ పంచాయతీ..


పనిచేయని సీసీ కెమెరా


అస్తవ్యస్తంగా ఉన్న వైరింగ్

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు..

ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో సర్పంచి నేలపూడి బేబి

ప్రజాశక్తి - ఆచంట

ప్రతి విద్యార్థికి విద్యతోనే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని వల్లూరు సర్పంచి నేలపూడి బేబి రామ్మోహన్ రావు అన్నారు. వల్లూరులో మహిళ జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ప్రెసర్స్ డే కార్యక్రమం సర్పంచి నేలపూడి బేబి రామ్మోహన్ రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నత విద్యను అభ్యసించి, మంచి ర్యాంకులతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని ఆమె అన్నారు. కార్పొరేట్ స్కూల్లో లక్షలు లక్షలు ఫీజులు కట్టినా, చివరకు ఎటువంటి ఉద్యోగాలు లేక ఇంటి దగ్గరే ఖాళీగా ఉంటున్నారని ఆమె అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర నరసింహం మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులకు ఎంసెట్లో ర్యాంకులు సాధించడం పట్ల చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఈ ర్యాంకులు సాధించడం పట్ల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు రాజకీయ నాయకులు కృషి ఎంతో అవసరమని తెలిపారు. వల్లూరులో మహిళలకు ఇంటర్మీడియట్ స్థాయి వరకు హాస్టల్ సదుపాయం కల్పిస్తే అయోధ్య లంక, మర్రి మూల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. మహిళా కాలేజీలో లేబరేటరీ సదుపాయం, ప్రత్యేక తరగతి గదులు, ఫర్నిచర్ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్లో విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు కృషిచేసిన తోటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు, ఆ పాఠశాల ఛైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ దొరబాబు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసి ఆరుమెల్లి సుబ్బారావు, ఉప సర్పంచి గద్దాడ శ్రీనివాసరావు, ఆ పాఠశాల డెవలప్మెంట్ కమిటీ సభ్యులు నేలపూడి రామ్మోహన్రావు, జనసేన అధ్యక్షులు ఉమా, ఉపాధ్యాయులు సిహెచ్.త్రిలోక మంగతాయారు, ఎం.చంద్రమౌళి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానించిన సర్పంచి బేబి


పనులు ప్రారంభిస్తున్న నాయకర్

తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని ప్రధాన కాలువలో తూడు, గుర్రపు డెక్క తొలగించే పనులకు ఆదివారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపి, వలవల నాని, బందెల రవీంద్ర, నిప్పులేటి తారక రామారావు, వట్టిప్రోలు సతీష్, పోలిశెట్టి సాంబ, పులి భుజంగరావు పాల్గొన్నారు.


రోడ్డుపై ఉన్న దమ్ము ట్రాక్టర్

దమ్ము చక్రాలతో పాడవుతున్న రోడ్లు..

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభం కాగానే దమ్ము చక్రాలతో పొలాలు దున్నే కార్యక్రమాలు ఊపు అందుకున్నాయి. ఎక్కడ చూసినా దమ్ము చేసే పెద్ద చక్రాలతో ట్రాక్టర్లు, మనుషులు చేత్తో పట్టుకొని నడిపించే చిన్న దమ్ము చక్రాల బండ్లు తిరుగుతూ రోడ్లను పాడు చేస్తున్నా, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సర్వీసు రోడ్లు, తారు రోడ్లు, పుంత రోడ్లు, రోడ్డు మార్జిన్లు ఈ దమ్ము చక్రాల వాహనాల వల్ల పాడై కోట్లాది రూపాయల నష్టం వస్తున్నా, అధికారులు పట్టించుకోవట్లేదని పలువురు విమర్శిస్తున్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నిర్వాహకులు

పిల్లలను బడిలో చేర్పించాలి


భీమవరం టౌన్: ఆధునిక యుగంలో పిల్లలను బడిలో చేర్పించకపోవడం తల్లిదండ్రుల దురదృష్టకరంగా భావించాలని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం వార్డెన్ చిటికెల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నరసయ్య అగ్రహారంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలోని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'బాలల్లారా బడికి పోదాం రండి..' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలలకు ఉచితంగా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని, వీటితోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఎన్నో రకాల సహకారాలు అందజేస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలని తెలిపారు. అనంతరం 52 మంది హాస్టల్ విద్యార్థులకు శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆర్థిక సహకారంతో నోట్ పుస్తకాలను అందజేశారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు గ్రామంలోని పసర చెరువు దగ్గర గల తూర్పు వీధిలోని చల్ల కోటిలింగం ఇంటి దగ్గర విద్యుత్ స్తంభం బీటలు వారి ప్రమాద భరితంగా ఉంది. ఈ విద్యుత్ స్తంభానికి గతంలో విద్యుత్ శాఖ వారు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. అయినా విద్యుత్ స్తంభం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అక్కడి జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పాడైన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం కనుక జరిగితే ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా వాటిల్లే అవకాశం ఉందని చెబుతున్నారు. విద్యుత్ శాఖ వారు వెంటనే స్పందించి ప్రమాదం జరగక ముందే నివారించాలని స్థానికులు కోరుతున్నారు.


బీటలు వారి..


ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

బెజవాడ కోడు ప్రక్షాళన..

మంత్రి నిమ్మలకు రుణపడి ఉంటాం : కాలనీవాసులు

ప్రజాశక్తి - పాలకొల్లు

బెజవాడ కోడు డ్రెయిన్ ప్రక్షాళన పది రోజుల్లో చేయించిన మంత్రి రామానాయుడుకు రుణపడి ఉంటామని కాలనీవాసులు చెబుతున్నారు. పాలకొల్లు పట్టణ 23వ వార్డులో ప్రవహించే బెజవాడ కోడు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన పనులు నోచుకోవడంతో ఆ ప్రాంత కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముంపు సమస్య తీరిందంటూ మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రవహించే డ్రెయిన్ పూర్తిగా తూడు, గుర్రపుడెక్క, మట్టి, చెత్తాచెదారంతో పూడుకుపోయింది. దీంతో మురుగునీరు పారుదల జరగక 23, 22 వార్డులలోని నివాస కాలనీలు చిన్నపాటి వర్షం, చినుకుపడినా ముంపుకు గురవడంతో ఆ ప్రాంతవాసులు అవస్థలు అనుభవిస్తున్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో ఆ నాయకులు పట్టించుకోకపోవడంతో, డ్రెయిన్లో చిన్నపాటి పని కూడా నోచుకోకపోవడంతో ముంపుతోపాటు దుర్వాసనకు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల మంత్రి రామానాయుడును కాలనీ వాసులు స్వయంగా కలిసి సమస్యను తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన మంత్రి రామానాయుడు బెజవాడ కోడు డ్రెయిన్తోపాటు దమయ్యపర్తి డ్రెయిన్ల ప్రక్షాళన పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగేలా చూడాలంటూ మున్సిపల్ కమిషనర్ విజయ సారధికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో 10 రోజుల్లో బెజవాడ కోడు డ్రెయిన్ ప్రక్షాళన జరగడంతో మురుగనీరు పారుదల జరిగి ముంపు సమస్య తీరింది.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

వెనుదిరుగుతున్న కొనుగోలుదారులు
ధరలపై తగు చర్యలు చేపట్టాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెనుగొండ

కూరగాయల ధరలు ఆకాశానంటుతుండడంతో సామాన్యులు రెండు, మూడు రకాల కూరగాయలతోనే సరిపెట్టుకుంటున్నారు. పెనుగొండలో చుట్టుపక్కల గ్రామాలకు అతిపెద్ద బజారు కావడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చి వారం పొడవునా కూరగాయలు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం బజార్లో కూరగాయల ధరలు మండిపోవడంతో కొనుగోలుదారుడు వెను తిరుగుతున్నాడు. కిలో ఉల్లి ధర రూ.40, పచ్చిమిర్చి రూ.60, టమాట రూ.80, వంకాయలు రూ.80, బీరకాయ రూ.80, దొండకాయ రూ.40, క్యారెట్ రూ.60, బీట్రూట్ రూ.60, బెండకాయలు రూ.80, బంగాళదుంపలు రూ.40, దోసకాయ రూ.40, ఆనపకాయ రూ.20 ఇలా ధరలు పెరగడంతో కనీసం కూరగాయలకు రూ.300 పైన మాటే ఖర్చు చేయవలసి వస్తుందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర నియంత్రించే అధికారులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ధరలపై తగు చర్యలు తీసుకోవాలని కొనుగోలు దారులు వేడు కుంటున్నారు.



ఖాళీగా ఉన్న పెనుగొండ సంత మార్కెట్..

కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి

షేక్ పాదుషా, సామాన్యుడు

కూరగాయల ధరలు మండిపోతున్నాయని షేక్ బాదుషా అన్నారు. సామాన్యుడికి చుక్కలు చూపెడుతున్నాయని, కూరగాయలు ధరలు గత కొన్ని రోజుల నుంచి ఇదే రేటు కొనసాగడంతో వ్యాపారస్తులకు మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగుతుందని, సామాన్యులకు కొనేదారి కనపడట్లేదని అన్నారు. ఇప్పటికైనా కూరగాయల ధరలు దిగిరావాలని కోరారు.

క్యూఆర్ కోడ్తో విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభం

ప్రజాశక్తి - ఉండి

క్యూ ఆర్ కోడ్తో విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభవుతుందని విద్యుత్ శాఖ ఉండి సహాయక ఇంజనీర్ ముదునూరి మాధవరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాధవరాజు మాట్లాడుతూ తమ నెలవారి బిల్లులు చెల్లించేందుకు దగ్గరలోని మీసేవ కేంద్రాలు, విద్యుత్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇకమీదట విద్యుత్ బిల్లు మీద ఉండే క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా బిల్లు చెల్లింపు చేయవచ్చునని అన్నారు. ఇప్పటి వరకు విద్యుత్ వినియోగదారులు పేటిఎం, ఫోన్ పే, అమెజాన్ పే, గూగుల్ పే వంటి యాప్ల ద్వారా బిల్లులు చెల్లించే వారని, ఈనెల నుంచి తమ విద్యుత్ బిల్లు మీద ఉండే క్యూ ఆర్ కోడ్ ఉపయోగించి చెల్లించవచ్చునని ఆయన తెలియజేశారు.

యాత్రికులతో ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. నరసాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి శ్వేతవస్త్రం ప్రసాదాన్ని అందించారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా జగన్నాథుని రథోత్సవం

నేడు అన్నదానం

ప్రజాశక్తి - ఉండి

ఉండి కొత్తపేటలో వేంచేసియున్న రాధా మదన్మోహన స్వామి ఆలయంలోని జగన్నాథ స్వామివారి రథోత్సవం ఆదివారం గ్రామ పురవీధుల్లో కన్నుల పండుగగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ పూరి జగన్నాథుని రథోత్సవం మాదిరిగా ఉండిలోని జగన్నాథుని రథోత్సవం చేయడం ఆనవాయితీగా వస్తుందని, గ్రామ ప్రజలకు జగన్నాథుడు, బలరాముడు, సుభద్రాదేవి మూడు రథాలలో ఊరేగింపుగా రావడం జరిగిందన్నారు. రథోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారి ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

ఏలూరు జిల్లా పోలవరం పంచాయితీకి చెందిన ఉంగుటూరి మురళీకృష్ణ S/o.ఉంగుటూరి పృథ్వి అనే వారివి పోలవరం బస్టాండ్ సమీపంలో **2-7-2024** తేదీన పదో తరగతి మార్క్ లిస్ట్, టి సి, స్టడీ సర్టిఫికెట్, ఇంటర్ కి చెందిన మార్క్ లిస్ట్, టి.సి, స్టడీ సర్టిఫికెట్లు పోలవరం కచేరి నుండి జీరాక్స్ నిమిత్తం పోలవరం వెళ్తుండగా మార్గం మధ్యలో పడి పోయినవి. ఇవి ఎవరికైనా దొరికితే ఈ నెంబర్కు సంప్రదించగలరు 9490721039

ప్రకటన

మహారాజశ్రీ తణుకు నాలుగవ అదనపు జిల్లా జడ్జ్ వారి కోర్టులో

I.A.No.419/2022 in O.S.No.8/2020

Between:

పిటిషనర్ /వాది : వెలగల శ్రీనివాస రెడ్డి
మరియు
రెస్పాండెంట్స్/ప్రతివాదులు : గుణ్ణం భాగ్య లక్ష్మీ(died) వగైరా
Proposed parties : పువ్వాడ సత్యనారాయణ వగైరా

3rd రెస్పాండెంట్
పువ్వాడ సత్యనారాయణ, S/o.not known, ముత్యాల ధర్మయ్య గారి వీధి, వేల్పూరు, తణుకు రూరల్ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534222

4th రెస్పాండెంట్
పువ్వాడ సురేష్, S/o.సత్యనారాయణ, ముత్యాల ధర్మయ్య గారి వీధి, వేల్పూరు, తణుకు రూరల్ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534222

పై నెంబరు దావా గ్రంథమునందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా నోటీసులు అమలు నిమిత్తము **ది.24.07.2024** సం.రం. తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయము గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// BY ORDER//
కొండూరి అనంతపద్మనాభం,
ఇందుకూరి వెంకట నరసింహరాజు,
Petioner తరపు న్యాయవాదులు,
ది.05.07.2024 తణుకు. సెల్ : 9948193227